మంచం పట్టిన పాతతండా..

- విషజ్వరాలతో బాధపడుతున్న తండావాసులు
- ఇంటింటికీ జ్వరపీడితులే..

కేసముద్రం: ప్రతి ఇంటా చిన్నారుల నుంచి వృద్ధుల వరకు డెంగీ, విషజ్వరాలతో బాధపడుతున్న సంఘటన ఇనుగుర్తి మండలంలోని పాతతండాజీపీలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పాత తండాజీపీలో సుమారు 150 కుటుంబాలు ఉన్నాయి. కొద్దిరోజులుగా తండావాసులు జ్వరాల బారిన పడుతున్నారు. క్రమక్రమంగా జ్వరపీడితుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం ప్రతి ఇంట్లో జ్వరాలతో, కాళ్లు, కీళ్ల నొప్పులు, నీరసంతో బాధపడుతూ మంచానికే పరిమితం అయ్యారు. చిన్నపిల్లలకు, పెద్దలకు డెంగీ జ్వరాలు, విషజ్వరాలు సోకుతుండటంతో, మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను తండావాసులు ఆశ్రయిస్తున్నారు. దీంతో అక్కడ పలురకాల రక్త పరీక్షలకు, ఇంజక్షన్‌లకు, మందులకు వేల రూపాయల్లో ఖర్చు అవుతుందని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరుపేదలు మాత్రం ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లలేక, ఇంటివద్దే ఉంటూ స్థానిక ఆర్‌ఎంపీ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఉదయం, సాయంత్రం సెలైన్ బాటిళ్లను ఎక్కిస్తూ, మందు గోళీలను ఇస్తున్నట్లు తండావాసులు తెలిపారు. ఇప్పటికే తండాకు చెందిన భుక్యా పోత్రం, ఇస్లావత్ చిట్టి, బోడ వీరు, ఇస్లావత్ రామకోటితోపాటు, పలు కుటుంబాలు కొద్దిరోజులుగా జ్వరాలతో బాధపడుతున్నారు. ఇక స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకునే 10మంది పిల్లలకు జ్వరాలు వస్తున్నట్లు తండావాసులు తెలిపారు. ఇంతగోస పడుతున్నా వైద్యాధికారులు మాత్రం తండావైపు చూడటంలేదని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా వర్షపు నీరు ఇళ్ల మధ్యలో, రోడ్డుపై నిలిచిపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయని, దీంతో దోమలు విపరీతంగా పెరిగాయని తండావాసులు తెలిపారు. ఇప్పటికైనా వైద్యులు తండాకు వచ్చి పరీక్షలు చేయాలని, అధికారులు పరిసరాలను శుభ్రం చేయించాలని తండావాసులు కోరుతున్నారు.


జ్వరంతో బాధపడుతున్న చిన్నారి బోడ అవినాష్


మంచం పట్టిన బోడ వీరు


జ్వరంతో బాధపడుతున్న భుక్యా పాత్రం, ఇస్లావత్ శరత్

క్లుప్తంగా

సర్వాయి పాపన్నకు ఘన నివాళి



కురవి/మరిపెడ/చిన్నగూడూరు: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వపాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గోపా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుర్ర శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బాలగాని నవీన్ గౌడ్ బెల్లంకొండ శ్రీనివాస్, తాళ్లపల్లి రమేష్, చిత్తనూరి శ్రీనివాస్, చీకటి శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవలతోనే గుర్తింపు



పెద్దవంగర: నిస్వార్థ సేవలతోనే ప్రజల్లో గుర్తింపు వస్తుందని ఎంపీడీఓ వేణుమాధవ్ అన్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని కాన్వాయిగూడెం గ్రామంలో జీపీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఆవుల వీరన్న ఉత్తమ సేవలు అందించినందుకు గాను ప్రశంసపత్రం అందుకున్నాడు. కాగా శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో వీరన్నను సన్మానించి అభినందించారు.

ఎస్పీని కలిసిన ట్రాఫిక్ ఎస్సై

మహబూబాబాద్ రూరల్: ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌ను ట్రాఫిక్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన నాగేశ్వర్‌రావు జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



కేసముద్రం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్‌పీఓ కనకదుర్గ అన్నారు. శనివారం మండలంలోని కల్వల ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛదనం-పచ్చదనంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి బండారు నరేందర్, జీపీ కార్యదర్శి అరుణ్‌జ్యోతి, హెచ్‌ఎం వీరారెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

దోర్నకల్: మండలంలోని బుద్ధారం రోడ్డు ప్రాంతానికి చెందిన నూర్జహాన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. శనివారం కాంగ్రెస్ నాయకులు మృతురాలి కుమారుడు ఇమాంపాషాకు రూ.10వేల ఆర్థికసాయం అందించారు. మున్సిపల్ చైర్మన్ వీరన్న, నాయకులు శ్రీనివాస్, హనుమంతరావు, కృష్ణ పాల్గొన్నారు.

గార్ల: మండలంలోని శేరిపురం పంచాయతీ మర్రిగూడెం గ్రామానికి చెందిన వృద్ధురాలు జాటోత్ ధన్లీ పక్షవాతం వచ్చి నడవలేని స్థితిలో ఉంది. శనివారం కాంగ్రెస్ నాయకుడు భూక్యా బాలు రూ.5వేల ఆర్థికసాయం అందజేశాడు.

బొగ్గుగనుల వేలంపాట నిలిపేయాలి

నెహ్రూసెంటర్: ప్రభుత్వ రంగసంస్థలో బొగ్గుగనుల వేలంపాలను నిలిపివేసి సింగరేణి ప్రాంతంలోని బొగ్గునిక్షేపాలను రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో సింగరేణి పరిధిలోనే కొనసాగించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్దన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని భట్టు అంజయ్య భవన్ సంఘం జిల్లా కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యూలర్ చేయాలన్నారు. కార్మికవర్గంపై కేంద్ర మోదీ ప్రభుత్వ కక్షసాధింపు చర్యలు ఉపసంహరించుకోవాలన్నారు. బీజేపీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 20నుంచి 31 వరకు ప్రచార కార్యక్రమాలు, సదస్సులు, సెప్టెంబర్ 27న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పర్వత కోటేష్, హలావత్ లింగన్న, ఎండి.జబ్బార్, లక్ష్మయ్య, కృష్ణ, బానోత్ లచ్చిరాం పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జనార్దన్

సాగునీటి కోసం పోరాటం


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బయ్యారం: ఏజెన్సీ ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించే వరకు సమరశీల పోరాటాలు చేయాలని అఖిలపక్ష పార్టీల నాయకులు గౌని ఐలయ్య, మండ రాజన్న పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని దొరన్న విజ్ఞాన కేంద్రంలో అఖిలపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం నందగిరి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. 2016 ఫిబ్రవరి 16న అప్పటి ప్రభుత్వం రోళ్లపాడు చెరువు, బయ్యారం చెరువులను రిజర్వాయర్స్‌గా మార్చి ఏజెన్సీ ప్రాంతానికి సాగునీరు అందిస్తామని శంకుస్థాపన చేసి కాలయాపన చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన డిజైన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రోళ్లపాడును రిజర్వాయర్‌గా, బయ్యారం చెరువును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జడ సత్యనారాయణ, వై.యాకన్న, నామ బాబురావు, రామచంద్రుల మురళీ, తోకల వెంకన్న, కోదుమూరి నాగేశ్వర్‌రావు, మెరుగుమల్ల శంకర్ పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

గార్ల: రైతులకు ఎలాంటి షరతులు లేకుండా అర్హులైన రైతుందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో రుణమాఫీకి అర్హత కలిగివున్న అనేక మంది రైతులకు ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ జాబితాలో పేరు లేకపోవడంతో అనేక మంది రైతులు ఆందోళన చెందుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా షరతులు లేకుండా రుణమాఫీ చేయాలన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకుడు రాజారావు, పెద్దవెంకటేశ్వరు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఆధార్‌లో మార్పులకు అవకాశం

తొర్రూరు: ఆధార్‌కార్డులో చేర్పులు, మార్పులకు స్థానిక పోస్టాఫీస్‌లో అవకాశం ఉందని, స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని తొర్రూరు సబ్‌పోస్టు మాస్టర్ ఎస్.కృష్ణమూర్తి తెలిపారు. ఆధార్‌కార్డుకు ఫోన్ నంబర్ లింక్ చేయడం, కొత్త ఆధార్ కార్డు తీయడం వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

అటెన్షన్ ప్లీజ్

శిథిలమవుతున్న జిమ్ పరికరాలు



దోర్నకల్: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌కు సంబంధించిన పరికరాలు శిథిలమవుతున్నాయి. వర్షాలతో జిమ్ ప్లాట్‌ఫాం చుట్టూ నీరు చేరడంతో పనికి రాకుండా పోతున్నాయి. పరికరాలు శిథిలమవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: నరేశ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్
ఫోన్‌నంబర్ : 93901 21800

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

ఎమ్మెల్యే కోరం కనకయ్య

బయ్యారం: రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని, ఎన్నికల ముందు రైతులకు, ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శనివారం బయ్యారం మండలం కొత్తపేట సెక్షన్ నాగారం తండా, నర్సా తండా గ్రామాల్లో విద్యుత్ శాఖ పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రమాదాలు జరగకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. డీఈ విజయ్ మాట్లాడుతూ.. స్తంభాలను, విద్యుత్ వైర్లను తడిచేతులతో ముట్టుకోవద్దని రైతులకు సూచించారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఫిట్స్‌తో బాలుడి మృతి


తరుణ్ (ఫైల్)

కేసముద్రం: ఫిట్స్‌తో ఓ బాలుడు మృతి చెందిన సంఘటన ఇనుగుర్తి మండల కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన తూళ్ల రాజు, రమ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడైన తూళ్ల తరుణ్(3)కు అర్ధరాత్రి ఫిట్స్ వచ్చింది. దీంతో బాలుడిని ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులు యత్నిస్తుండగా మృతి చెందాడు.

బంద్ ప్రశాంతం

చిన్నగూడూరు/డోర్నకల్/మరిపెడ/గార్ల/దంతాలపల్లి: బంగ్లాదేశ్‌లో హిందువులపై, హిందువుల దేవాలయాలపై జరుగుతున్న దాడులను వ్యతిరేకిస్తూ బీజేపీ, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో తలపెట్టిన బంద్ ప్రశాంతంగా జరిగింది. మండల వ్యాప్తంగా శనివారం విద్యాసంస్థలు, హోటల్స్, వ్యాపార సంస్థలను బంద్ చేయించారు.

వృద్ధాప్యంలో ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

తొర్రూరు: వృద్ధాప్యంలో ఆరోగ్యంపై శ్రద్ధ అవసరమని మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య అన్నారు. ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో శనివారం డివిజన్ కేంద్రంలోని లయన్స్‌క్లబ్ భవనంలో వృద్ధులకు వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పలు రకాల పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చిదురాల నవీన్‌కుమార్, ప్రతినిధులు డాక్టర్ రవికుమార్, శ్రావణ్‌కుమార్, కిషన్, రమేష్, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న చైర్మన్, తదితరులు

ముందస్తు రక్షాబంధన్ వేడుకలు


మహబూబాబాద్ రూరల్: మాధవాపురం ప్రభుత్వ పాఠశాలలో..


కేసముద్రం: శ్రీవివేకవర్ధిని హైస్కూల్‌లో..

పాఠశాలల్లో శనివారం ముందస్తు రాఖీ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు విద్యార్థులు, ఉపాధ్యాయులకు రాఖీ కట్టారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. రక్షాబంధన్ ఆత్మీయ అనురాగాలకు ప్రతీక అన్నారు.

\- సాక్షి నెట్‌వర్క్


మరిపెడ: జిల్లా పరిషత్ పాఠశాలలో..


దంతాలపల్లి: రాఖీలు కడుతున్న విద్యార్థినులు

సంక్షిప్త సమాచారం

ఏఓల బాధ్యతల స్వీకరణ

పెద్దవంగర/దంతాలపల్లి/నర్సింహులపేట: పెద్దవంగర ఏఓగా గుగులోతు స్వామి, దంతపాలపల్లి ఏఓగా వాహిని, నర్సింహులపేట ఏఓగా వినయ్‌కుమార్ శనివారం ఆయా మండల కేంద్రాల్లో బాధ్యలు స్వీకరించారు.

విద్యుత్ మోటార్ల చోరీ

దోర్నకల్: మండలంలోని చాప్లాతండాలోని మూడు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి విద్యుత్ మోటార్లు చోరీకి గురయ్యాయి. చాప్లాతండాకు చెందిన రైతులు దారావత్ రత్నా, భూక్యా భద్రు, భూక్యా సక్రాంలకు చెందిన వ్యవసాయ బావుల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నర్సింహులపేట: మండల కేంద్రంలో ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ ఆదేశాల మేరకు శనివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు జినుకుల రమేష్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రూ.9.58 లక్షల విలువ గల చెక్కులు మంజూరు అయినట్లు రమేష్ తెలిపారు.

విజయవంతం చేయాలి

దోర్నకల్: మహబూబాబాద్‌లో నేడు జరిగే సేవాలాల్ సేన జిల్లా సదస్సును విజయవంతం చేయాలని సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు భూక్యా బాలునాయక్ కోరారు. మండలంలోని చాప్లాతండా గ్రామంలో శనివారం సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

సమన్వయంతోనే సర్దుబాటు

దోర్నకల్: ఉపాధ్యాయ సంఘాల సమన్వయంతోనే పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు జరిగిందని పలు ఉపాధ్యాయ సంఘాలు తెలిపాయి. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో శనివారం ఎంఈఓ పూల్‌చంద్ ఆధ్వర్యంలో జరిగిన సంఘాల సమన్వయ సమావేశంలో నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఆంగోత్ లక్ష్మా, రుక్మాంగదరావు, నర్సింహారావు, నాయకులు శ్రీధర్, వినోద్, అజీజ్, శివ, సాయిబాబు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సన్మానం

కురవి: ఎంపీడీఓ వీరబాబును మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ వీరబాబుకు ఉత్తమ అధికారిగా ప్రశంస పత్రం రావడంతో సత్కరించారు. నాయకులు శ్రీనివాస్, మోహన్‌రావు, వీరభద్రం, గణేశ్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రజల మన్ననలు పొందాలి

కురవి: ఉద్యోగ బాధ్యతలను నిర్వహిస్తున్న ప్రతీ ఒక్కరు ప్రజల మన్ననలు పొందాలని కాంపల్లి మాజీ సర్పంచ్ తోట శోభారాణి రమేష్ అన్నారు. శనివారం సీరోలు మండలం కాంపల్లి గ్రామంలో నాలుగు ఏళ్లు పని చేసిన జె.రఘువీర్ బదిలీపై వెళ్లడంతో వీడ్కోలు సమావేశం నిర్వహించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధికారి రాజమణి, చంద్రయ్య, వీరన్న పాల్గొన్నారు.

కేసు నమోదు

నర్సింహులపేట: మండలంలోని గ్రామ పంచాయతీ శివారులోని తండాకు చెందిన విద్యార్థిని వేధించి ఆత్మహత్యాయత్నం చేసుకోవడానికి కారణమైన ఘటనలో శనివారం కేసు నమోదు అయింది. ఎస్సై సురేష్ కథనం ప్రకారం.. మండలంలోని విద్యార్థిని ఖమ్మంలో డిప్లొమా చదువుతుంది. అదే కాలేజీకి చెందిన విద్యార్థి వేధించడంతో ఇంటికి వచ్చి ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మాహత్యాయత్నం. వెంటనే చికిత్స నిమిత్తం మహబూబాబాద్ అస్పత్రికి తరలించారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధురాలిపై కోతుల దాడి

కురవి: సీరోలు మండలం కాంపల్లి గ్రామంలో ఓ వృద్ధురాలిపై శనివారం కోతుల గుంపు దాడికి పాల్పడ్డాయి. కాంపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు కౌసల్యపై కోతుల గుంపు దాడికి దిగాయి. దీంతో వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. రక్తస్రావం కావడంతో స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీతో ప్రాథమిక చికిత్స చేయించారు. 108 వాహనంలో కౌసల్యను మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



మహబూబాబాద్ అర్బన్: పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన..


గూడూరు: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


గార్ల: నిరసన తెలుపుతున్న వైద్యసిబ్బంది

మహబూబాబాద్ అర్బన్: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు సిద్దు, ప్రకాశ్, మహేందర్, దినేశ్ భరత్ పాల్గొన్నారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహరావు, జిల్లా అధ్యక్షుడు గౌతం, యాకయ్య పాల్గొన్నారు.

గూడూరు: వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి హత్యకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని వైద్యురాలు యమున డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం అయోధ్యపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కోల్‌కతా ఘటనను నిరసిస్తూ పీహెచ్‌సీల వైద్యులు, వైద్య సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు, ప్రత్యూష, విరాజిత, మౌనిక, రాంబాబు, శివ, మురళీ, ప్రతిభ, నరేష్, డీపీఎంఓ లావరం, మేరీ, లోక్యానాయక్ పాల్గొన్నారు.

తొర్రూరు: కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని తొర్రూరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పగిడిపాటి సుగుణాకర్‌రాజు అన్నారు. వైద్యురాలి హత్యను నిరసిస్తూ ప్రభుత్వ, ఏరియా ఆస్పత్రి వైద్య సిబ్బంది నిరసన తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రులు బంద్ నిర్వహించాయి. అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపి పట్టణంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. నిరసనలో వైద్యులు డాక్టర్ జ్వలిత, మీరాజ్, ప్రియాంక, మానస, తదితరులు పాల్గొన్నారు.

గార్ల: వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులకు వెంటనే ఉరి తీయాలని డిమాండ్ చేస్తూ శనివారం గార్ల సీహెచ్‌సీ ఎదుట వైద్యులు, వైద్యసిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు హనుమంతరావు, అన్నపూర్ణ, స్టాఫ్‌నర్సులు రమ, సరిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


తొర్రూరు: నిరసన తెలుపుతున్న వైద్యులు

దంతాలపల్లి: మండల కేంద్రంలోగల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బంది శనివారం నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సత్యనారాయణ, రహిమాన్, సుభద్ర, స్వప్న, మంగమ్మ పాల్గొన్నారు.

మరిపెడ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రవి ఆధ్వర్యంలో శనివారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్‌లు కృష్ణ, సుదర్శన్, ఆచార్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత

మహబూబాబాద్: హైదరాబాద్ గాంధీ స్మారక ట్రస్ట్ నుంచి జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయానికి సుమారు 201 పుస్తకాలు పంపారు. వాటిని శనివారం గాంధీ ట్రస్ట్ నిధి చైర్మన్ రంగారావు, స్వాతంత్య్ర సమరయోధుడు నూకల లింగారెడ్డి, సమరయోధులు వారసుల సంఘం ప్రతినిధులు సింగు రమేష్, రవీంద్రగుప్తా గ్రంథాలయానికి అందజేశారు.

ఇంట్లో చొరబడిన కొండచిలువ



కొత్తగూడ: భారీ కొండచిలువ ఇంట్లోకి చొరబడ్డ సంఘటన మండలకేంద్రంలోని జీఎల్ నగర్‌లో శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బొర్ర ఆనంద్ కుటుంబం నివాసం ఉంటున్న ఇంట్లోకి సుమారు ఆరు అడుగుల పొడవు ఉన్న కొండచిలువ వచ్చింది. గమనించిన వారు అరవడంతో సమీప అటవీ ప్రాంతంలోకి పారిపోయింది.